వృద్ధులు.. పరేషాన్.!

- రేషన్ సరకుల కోసం అవ్వాతాతల అవస్థలు
- ఎండీయూ వాహనాల నిలిపివేతతో మొదలైన పాట్లు
- డిపోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వృద్ధులు



కొరుప్రోలు డిపో వద్ద రేషన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఎస్.రాయవరం: రేషన్ సరకుల కోసం ప్రతినెలా అవ్వాతాతలు పరేషాన్ అవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఇంటింటికీ రేషన్ బండి(ఎండీయూ)తో వచ్చి సరకులు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సేవలు నిలిపివేయడంతో వృద్ధులకు తిప్పలు మొదలయ్యాయి. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి ప్రతి నెలా ఆఖరి వారంలో సరకులు అందజేస్తామన్న ప్రకటనలు కూడా అమలుకు నోచుకోవడం లేదు. ఎస్.రాయవరం మండలంలో రేషన్ డిపోల ద్వారా రేషన్ సరకుల సరఫరాతో వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. రేషన్ డీలర్లు 65 సంవత్సరాలు నిండిన వారికి ఇంటికి తీసుకెళ్లి సరకుల ఇచ్చే క్రమంలో నిర్లక్ష్యం వహించడంతో లబ్ధిదారులు రేషన్ ఇవ్వరేమో అన్న భయంతో డిపోల వద్దకు వెళ్లి రేషన్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరు ఇంటికి రేషన్ వస్తుంది కదా? అని ఎదురు చూస్తే ఆ నెల రేషన్ డీలర్ దుకాణం బంద్ చేసి వెళ్లిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో లబ్ధిదారులు రెండు విధాలా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఇంటింటికీ రేషన్.. 3 వేల కార్డుల ఎంపిక

మండలంలో 23,789 రేషన్ కార్డులు ఉండగా.. ఇంటింటికీ రేషన్ ఇచ్చేందుకు 3 వేల కార్డులు ఎంపిక చేసి ఆయా డీలర్లకు వివరాలు పంపారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ బళ్లు కూటమి ప్రభుత్వం నిలిపివేసిన సంగతి తెలిసిందే. గ్రామాల్లో రేషన్ డీలర్లు నిర్లక్ష్య ధోరణితో డిపోకు వచ్చిన వారికి రేషన్ ఇచ్చి, ఇంటికి వెళ్లి రేషన్ ఇచ్చే పద్ధతి నుంచి తప్పించుకుంటున్నారు. ఇప్పటికి మూడు నెలలుగా మండలంలో ఇవే సమస్యలు గ్రామాల్లో ఉత్పన్నమవుతున్నాయి. దీంతో రేషన్ తీసుకుకోవడంలో అవ్వాతాతలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో వయోవృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు ఇంటికి వెళ్లి రేషన్ సరకులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.



గుర్రాజుపేటలో నెత్తిన పెట్టుకుని రేషన్ తీసుకెళ్తున్న వృద్ధురాలు

గతంలో ఇంటికి తెచ్చి ఇచ్చేవారు..



జగనన్న ప్రభుత్వంలో రేషన్ బండి ద్వారా ఇంటికి సరకులు తుచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రేషన్ డిపోకు రావాల్సి వస్తుంది. ఆ బియ్యం తీసుకెళ్లేందుకు తెలిసిన వారిని బ్రతిమాలాడుకుని తీసుకెళ్లాల్సి వస్తోంది. మూడు నెలలుగా రేషన్ తీసుకునేందుకు చాలా అవస్థలు పడుతున్నా.

– శెట్టి గౌరి, వికలాంగురాలు, తిమ్మాపురం

బియ్యం మోయలేకపోతున్నాం..



నా వయస్సు 67 సంవత్సరాలు. మా ఇంటికి రేషన్ ఇచ్చేందుకు డీలరు వచ్చారు. ఆ సమయంలో ఆస్పత్రి పని మీద బయటకు వెళ్లాను. మళ్లీ తెచ్చి ఇవ్వరేమోనని డిపోకు వచ్చి రేషన్ తీసుకున్నాను. ఆ సరకులు ఇంటికి తీసుకువెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది.

– జి.అన్నపూర్ణ, వయోవృద్ధురాలు, తిమ్మాపురం

ఇంటికే రేషన్ పంపిణీ చేయాలి



నా వయస్సు 65 సంవత్సరాలు. డిపోల వద్ద రేషన్ ఇచ్చినప్పటి నుంచి ఇంటికి తెచ్చి సరకులు ఇవ్వాలని కోరుతున్నా డీలరు సమాధానం చెప్పడంలేదు. తప్పనిసరి పరిస్థితిలో డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నా. అధికారులు స్పందించి ఇంటింటికీ సరకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

– తోట అప్పారావు, తిమ్మాపురం

గత నెల రేషన్ అందలేదు..



గత నెల నా ఆరోగ్యం బాగోక ఇంటి వద్ద లేను. నా భర్త 67కు ఏళ్లు. ఇంటి వద్దనే ఉన్నారు. డీలర్ రేషన్ తెచ్చి ఇవ్వలేదు. ఆ నెల రేషన్ బియ్యం కోల్పోయాను. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకు బండి ద్వారా బియ్యం ఇచ్చే వారు. ఇప్పుడు తెచ్చుకోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వం మాలాంటి వారిని పరిగణనలోకి తీసుకోవాలి.

– ఎం.అమ్మాజీ, కొరుప్రోలు

పర్యవేక్షించి చర్యలు తీసుకుంటాం..



రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు సరఫరా చేసే డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రతి నెలా డిపోల వారీగా ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వాల్సిన వివరాలు పంపిస్తున్నాం. వారికి ప్రత్యేక సమయం కేటాయించి రేషన్ ఇవ్వాలని ఆదేశిస్తున్నాం. ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం. మరోమారు పర్యవేక్షిస్తాం.

– జి.రమేష్‌బాబు, తహసీల్దార్, ఎస్.రాయవరం మండలం

క్లుప్తంగా

డిగ్రీ కళాశాల మైదానంలోనే పూజా సామగ్రి విక్రయాలు

యలమంచిలి రూరల్: త్వరలో జరగనున్న వరలక్ష్మీ వ్రతం, వినాయక చవితి పండగలకు సంబంధించి పూజా సామగ్రి అమ్మకాలను ఇకపై యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలోనే జరపాలని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వీధి వ్యాపారులు, వర్తక సంఘం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ప్రధాన రహదారి పక్కన ఇష్టారాజ్యంగా పూజా సామగ్రి విక్రయాలు జరపడం వల్ల డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోతోందన్నారు. ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. దీంతో ప్రధాన రహదారి, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పూజ, పండుగ అవసరాలకు వినియోగించే సామగ్రి విక్రయించడానికి వీల్లేదని ఆయన చెప్పారు. ఈ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, ఎవరైనా అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు గమనించాలని కోరారు.

ఆంజనేయ విగ్రహం కూల్చివేతపై అభ్యంతరం



ఆంజనేయ విగ్రహం తొలగింపులో భాగంగా ఆందోళన చేస్తున్న భక్తులు

మునగపాక: రహదారి ఏర్పాటులో భాగంగా మునగపాకలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని తొలగించడం సరికాదంటూ కొందరు భక్తులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాక జంక్షన్ వద్ద ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తొలగించడాన్ని పలువురు తప్పుపట్టారు. విగ్రహాన్ని కూల్చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని మరో చోటకు తరలించాల్సి ఉన్నా గుత్తేదారు కూల్చివేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇటువంటి సంప్రదాయం సరికాదంటూ హితవు పలికారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. మంగళవారం య్లలపు గంగునాయుడు, సీతయమ్మ దంపతుల జ్ఞాపకార్థం మనవుడు జగదీష్ రూ.25,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణకు సహకరించాలి



టీడీఆర్ బాండ్లు అందజేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నిర్వాసితులకు ఆయన టీడీఆర్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోతున్న వారికి మెరుగైన పరిహారం అందజేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారి విస్తరణ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు పెంటకోట ఆదినారాయణ, విజయ్, అజయ్, శ్రీనివాసరావు, ఆదినారాయణ నాయుడు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నీలిగుంటలో పారిశుధ్య పనులు




నీలిగుంటలో డ్రైనేజీలో పూడిక తీయిస్తున్న సర్పంచ్ వరహాలబాబు

కోటవురట్ల: నీలిగుంటలో మంగళవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు పొక్లెయిన్‌తో కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధుల్లో చెత్తను ఇష్టానుసారం వేయకుండా పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు. ఇంటి పరిసరాలతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు వేయకుండా నిర్దేశించిన ప్రదేశాలలో వేయాలని సూచించారు.

సాగునీరివ్వకుండా నీటి పన్ను నోటీసులా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



యలమంచిలి రూరల్: సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో పంటలకు సాగునీటి సరఫరా చేయకుండానే గత 10 సంవత్సరాల్లో లేని విధంగా నీటి పన్ను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నోటీసులు పంపించడం దారుణమని వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న ప్రతిసారీ రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తుంటుందన్నారు. రాష్ట్రంలో తమకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిపడా ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో సరఫరా చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులెవరూ నీటి పన్ను చెల్లించవద్దని సూచించారు. రైతులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో చంద్రబాబు పాలన సాగుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ముందు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగనన్న పాలన రావాలని, ఇదే రైతులందరూ కోరుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

త్వరలో రీ-సర్వే పనులు ప్రారంభం



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: రీ–సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 26 సచివాలయాల పరిధిలో మూడు పంచాయతీలలో రీ–సర్వే మిగిలి ఉందన్నారు. టి.సిరసపల్లి, చెర్లోపాలెం, నాగవరం పంచాయతీలలో రీ–సర్వే పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రైతులు అధికారులకు అందుబాటులో ఉంటూ రీ–సర్వేకు సహకరించాలన్నారు. అలాగే మునగపాక మండలానికి సంబంధించి రూ.3 కోట్ల మేర నీటి తీరువా వసూళ్ల లక్ష్యంగా చేసుకున్నామని, రైతులు సచివాలయాలకు వెళ్లి తీరువా చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

బూటకపు హామీలు చంద్రబాబు నైజం



మర్రిపాలెం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): చంద్రబాబు మోసాలను, బూటకపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బాబు షూ్యరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలం మర్రిపాలెం, దిమిలి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బాబు, కరువు కవల పిల్లలని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రతి సారి ఎన్నికలకు ముందు అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వడం, గద్దెనెక్కాక వాటిని విస్మరించడం షరా మామూలుగా మారిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామ కమిటీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సూపర్‌సిక్స్ అని చెప్పి మోసపూరిత హామీలు ఇచ్చిన కూటమి పార్టీలకు ప్రజలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దిమిలి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి ధర్మశ్రీ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్ బాబు, కొవిరి రామకృష్ణ, నెట్టెం సత్యనారాయణ, నీరుకొండ సూర్యనారాయణ, బొడ్డపు అప్పన్నదొర, నగిరెడ్డి కృష్ణ, దూది నర్సింగమూర్తి, ధూళి వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడానికే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు



ఎలక్ట్రికల్ ఏఈకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు



పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వినియోగదారులు

అచ్యుతాపురం రూరల్ : స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల విద్యుత్ చార్జీలు పెరుగుతాయని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము అన్నారు. మంగళవారం అచ్యుతాపురం ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పి, అధికారంలోకి వచ్చాక అవే స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. సీపీఎం నాయకుడు కూండ్రపు సోమునాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, జిల్లా కార్యదర్శి రామసదాశివరావు, ఆర్.సత్తిబాబు, నాయుడు, గంగరాజు, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అదానీ స్మార్ట్ మీటర్లు వద్దని, పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వినియోగదారులు ఆందోళన చేశారు. సరైన ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇప్పుడు పెంచిన విద్యుత్ చార్జీలు పెనుభారంగా మారాయని చెప్పారు. స్మార్ట్ మీటర్ల విధానం వస్తే ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే 200 యూనిట్లు విద్యుత్ రాయితీ గాల్లో కలిసిపోతుందన్నారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): స్మార్ట్ మీటర్లు తమకొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రాంబిల్లి సచివాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్‌రావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దేవుడినాయుడు, నారాయణరావు, కాశీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

మునగపాక: ప్రభుత్వ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో మంగళవారం రైతులకు రాయితీపై యూరియాను అందజేశారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతులు, లైన్‌లో కేబుల్ మార్పిడి వంటి పనులు కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, పెద బోదిగళ్లం, సీతంపాలెం గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

నీటి తీరువా వసూళ్లను నిలిపివేయాలి



వెంకటాపురం వీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ప్రభుత్వం నీటి తీరువా వసూళ్లను నిలిపివేయాలని కోరుతూ మండలంలోని వెంకటాపురం వీఆర్వోకు మంగళవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయం ఎదుట రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాలువలు, గెడ్డల ద్వారా నీరు ప్రవహించే పరిస్థితులు లేని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు నీటి తీరువా చెల్లించాలంటూ నోటీసులు అందించడం సమంజసం కాదన్నారు. వెంకటాపురం మెట్ట ప్రాంతమని, ఈ గ్రామంలో చెరువులు, కాలువల ద్వారా భూములకు నీరు ప్రవహించే అవకాశం లేనందున రెవెన్యూ అధికారులు తక్షణమే నీటి తీరువా వసూళ్లకు సంబంధించి నోటీసులు పంపడం సరికాదన్నారు. ఇటువంటి చర్యలను ప్రభుత్వం ఆపాలని, లేకుంటే రైతులతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతు సంఘ నాయకులు కడియం దివాకర్, సుందరపు రామకృష్ణ, చిన్ని రామారావు, నక్కా రాజు, సత్యారావు, కరణం రామకృష్ణ, సత్యారావు, మోహన్, రామునాయుడు, శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

కోటవురట్ల: ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారి సరోజిని, ఆత్మ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ సత్యవేణి తెలిపారు. యండపల్లిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవామృతంతో పురుగులు, తెగుళ్లను నివారించడం ద్వారా పంటలో మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు వేపగింజల కషాయాన్ని తయారు చేసుకుని పంటల్లో పిచికారీ చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. వేపగింజల కషాయంతో పచ్చపురుగు నాశనమవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంట రావడమే కాకుండా మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రమణమ్మ, రవి, ప్రభావతి, సుదర్శన్, నాగగోవిందు, రైతులు పాల్గొన్నారు.

వైఎంపీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక



పాస్టర్స్ సహవాసం నూతన కార్యవర్గం

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల పాస్టర్స్ సహవాసం(వైఎంపీఎఫ్) నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం పట్టణంలోని కాకివాని వీధిలో ఉన్న యేసు క్రీస్తు ప్రార్థన సహవాసం చర్చిలో జరిగింది. అనకాపల్లి యూపీఎఫ్ కార్యవర్గ సభ్యుడు కేపీడీఆర్ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో సంఘం చైర్మన్‌గా పీటర్, గౌరవ అధ్యక్షుడిగా కృపారావు, అధ్యక్షుడిగా డి.ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా జాన్సన్, ఎస్.సాల్మన్ రాజు, కార్యదర్శిగా కె.జగదీష్ పాల్, సహాయ కార్యదర్శిగా సీహెచ్.శాంతరాజు, కోశాధికారిగా ఎ.ఎజ్రా, ఉపకోశాధికారిగా పి.సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా మరో 9 మంది పాస్టర్లు ఎంపికయ్యారు. ప్రిన్స్ మినిస్ట్రీస్ ముఖ్య నిర్వాహకుడు క్రాంతిపాల్ కార్యవర్గాన్ని బలపరిచారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు పాస్టర్లు అభినందించారు.

వచ్చే నెల 15న చలో విజయవాడ

రాంబిల్లి(అచ్యుతాపురం): సంక్షేమ బోర్డు పథకాల పునరుద్ధరణ కోసం భవన నిర్మాణ కార్మికులు వచ్చే నెల 15న చేపట్టనున్న చలో విజయవాడను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్‌రావు కోరారు. రాంబిల్లిలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి భవన నిర్మాణ కార్మికుల మహాసభల్లో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు కమిషనర్ కార్యాలయానికి తరలివెళ్లి డిమాండ్ల సాధన కోసం పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అడిగర్ల రాజు, కె..రామకృష్ణ, జి.అప్పారావు, దేవుడునాయుడు, రాంబాబు, నాగేంద్ర, నారాయణరావు, దేవి, రాము, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణం

ఎస్.రాయవరం: రామయ్యపట్నం జగనన్న కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో 5 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణం పనులు చేపట్టారు. కాలనీలో తాగునీటి సమస్య దృష్టిలో ఉంచుకుని ఇన్‌చార్జ్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా రాజు, వైబోయిన సత్యనారాయణలకు ట్యాంకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వేగంగా ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి తాగునీటి సరఫరా చేయిస్తామని రాజు, సత్యనారాయణ తెలిపారు.

గ్రామాల్లో 'పిలం పిలుస్తోంది'

పాయకరావుపేట: మండలంలోని పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పిలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రస్తుత వరి నారు మడిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి, తమల పాకు తోటలను సందర్శించి చీడపీడలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఏఏ శాస్త్రవేత్త శ్రీహరి, ఎంపీహెచ్‌వో, ఏఈవో, ఏపీసీఎన్ఎఫ్, వలంటీర్స్, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరాజుకు పరామర్శ



వెంకటరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

ఎస్.రాయవరం: కార్యకర్తలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు సూచించారు. పార్టీ ఎస్.రాయవరం మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ అడ్డురోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జోగులు మంగళవారం ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, పార్టీ జిల్లా కార్యదర్శి మధువర్మ, బంగారమ్మపాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యకరం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణ

పాయకరావుపేట: పిల్లలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యకరమైనవని జెడ్పీటీసీ సభ్యుడు లంక సూర్యానారాయణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో తల్లిపాల వారోత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో నెహూ, సూపర్‌వైజర్ కె.లలిత, ఎస్కే బీబీ, లోవరాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొరుప్రోలు పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

ఎస్.రాయవరం: కొరుప్రోలు పీఏసీఎస్ చైర్మన్‌గా గుర్రం రామకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పెద్దలు, రైతులు, సొసైటీ సిబ్బంది రామకృష్ణను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా రైతులకు రూ.19.90 లక్షల రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిపాటి సత్యనారాయణ, కోరా రామారావు, మాజీ ఎంపీపీ యేజర్ల వినోద రాజు, లాలం కాశీనాయుడు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దండు అచ్యుతరామరాజు, కోన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ'

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరయ్యే ఈ కార్యక్రమం రజాల, కుమ్మరాపల్లి, కట్టబోలులో జరుగుతుందని పేర్కొన్నారు.